క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజమే మన సంకల్పం

● ఎస్సై సన్యాసినాయుడు, ఎంపీపీ బంటుపల్లి



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: డ్రగ్స్ రహిత సమాజమే అందరి సంకల్పం కావాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



దుర్గాప్రసాద్, ఎస్సై

పూసపాటిరేగ: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేకాట శిబిరాలు నిర్వహించినా, కోడిపందాలు ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పండగ రోజులలో ఇంటికి తాళం వేసుకుని ఊర్లకు వెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

కొబ్బరి పంటకు బీమా తప్పనిసరి

● ఉద్యానవన అధికారి జ్యోత్స్న

పూసపాటిరేగ: కొబ్బరి సాగు చేస్తున్న రైతులు పంటకు బీమా చేయించకోవడం మేలని ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'ఈ పంట'లో నమోదుకు పొట్టి, సంకర జాతి మొక్కలు 4 నుంచి 60 సంవత్సరాలు.. పొడుగు మొక్కలైతే 7 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసుండాలన్నారు. 4 నుంచి 15 సంవత్సరాల వయసున్న ఒక్కో మొక్కకు రూ. 2.25.. 16 నుంచి 60 సంవత్సరాల వయసున్న మొక్కకు 3.50 రూపాయలు చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలసమయంలో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని చెప్పారు. సమాచారం కోసం రైతుభరోసా కేంద్రంలో ఉద్యానవన సహాయకులను సంప్రదించాలన్నారు.

7న రంగోళీ పోటీలు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో ఈ నెల 7న రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్విజ్, డ్రాయింగ్, హ్యాండ్‌రైటింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆరు నుంచి ఇంటర్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు పి. రవికుమార్ (సెల్: 79893 50244), కె. సూర్యారావులను (సెల్: 89199 85388) సంప్రదించాలని కోరారు.

ఆశలు ఆవిరి..

● 'తల్లికి వందనం' ఊసే ఎత్తని బాబు
● టర్మ్ ఫీజుల కోసం స్కూళ్ల యాజమాన్యాల ఒత్తిడి
● వాట్సాప్‌లలో మెసేజ్‌లు పంపుతున్న వైనం
● ఫీజు చెల్లించకపోతే పరీక్షలకు అనుమతించబోమని వెల్లడి
● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

విజయనగరం: నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీప్రాంతంలో ఉంటున్న సౌజన్య తన భర్త తీసుకువచ్చే రోజువారీ కూలీతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈమెకు ఇద్దరు పిల్లలు. ప్రవీణ్ ఏడో తరగతి, సుదీక్ష నాలుగో తరగతి చదువుతున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' కింద ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పడంతో ఇద్దరు బిడ్డలను ప్రైవేట్ స్కూల్లో చేర్పించింది. కానీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా పైసా సాయం అందించలేదు. మరోవైపు ఫీజుల కోసం పాఠశాల యాజమాన్యం ఒత్తిడి తీసుకువస్తుండడంతో సౌజన్య పడరాని పాట్లు పడుతోంది. నియోజకవర్గంలో ఇలాంటి వారు చాలా మందే ఉన్నారు.

అందరికీ..

ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ 'తల్లికి వందనం' అందిస్తాం. ఒకరు ఉంటే రూ.15 వేలు.. ఇద్దరు ఉంటే రూ.30 వేలు, ముగ్గురు ఉంటే రూ.45 వేలు.. నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తాం' అంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రచారం ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయలేదు. కనీసం ఈ పథకం ప్రస్తావనే చేయడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై.. ఆర్నెల్లు కావడంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఫీజుల కోసం తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపుతున్నారు. తరగతుల వారీగా ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుల్లో వార్నింగ్ ఇచ్చే విధంగా ఫీజులు డిమాండ్ చేస్తున్నారు. ఫీజు చెల్లించకపోతే ఎగ్జామ్ ఫీజు కూడా తీసుకునేది లేదని తేల్చి చెబుతున్నారు. ఫీజులు తీసుకురావాలని పిల్లలపై కూడా ఒత్తిడి చేస్తున్నారు.

విద్యార్థుల వివరాలు	
నియోజకవర్గం	విజయగనరం
1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు:	47, 362
ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య:	14,021
ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారు:	33,341
తల్లికి వందనం పేరిట మంజూరు చేయాల్సిన మొత్తం:	రూ.70.98కోట్లు
ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించిన మొత్తం:	రూ. 0

గత ప్రభుత్వంలోనే మేలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఠంచన్‌గా 'అమ్మ ఒడి' ద్వారా రూ.15 వేల చొప్పున విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఆ పథకానికి ఆదరణ దక్కడంతో ఎన్నికల ముందు చంద్రబాబు కూడా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు ఆయన మాటలు నమ్మి ఓట్లు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఫీజులు కట్టలేక పేదలు అవస్థలు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో నియోజకవర్గం పరిధిలో ఇలా..

పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'అమ్మఒడి' పథకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు విడతల్లో నియోజకవర్గంలోని తల్లుల ఖాతాల్లో రూ.138.09 కోట్లు జమ చేసింది. దీంతో పథకం విజయవంతమై డ్రాపౌట్స్ సంఖ్య భారీగా తగ్గింది. కానీ ఇప్పుడు ఫీజులు చెల్లించలేని స్థితిలో చాలా మంది తమ పిల్లలను చదువులు మాన్పిస్తున్నారు.

● పారిశుధ్య పనులు..

కొన్నేళ్లుగా వర్షపు నీరు, పైపులైన్ లీకులు, మట్టి, చెత్తాచెదారాలతో నిండి ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జికు ఎట్టకేలకు మోక్షం లభించినట్టైంది. కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ సిబ్బంది శనివారం యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేట్టారు. జేసీబీ సహాయంతో చెత్త తొలగిచారు.



కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం

● అభినందనలు..



హోమీబాబా సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఐఏపీటీ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్) పరీక్షలో సత్తాచాటిన విద్యార్థినులను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శనివారం అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచగా... అందులో విజయనగరం -1లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థినులు పి.నిత్యశ్రీ, ఎ.శ్రీవర్షిణి ఉండడం గమనార్హం. కార్యక్రమంలో పాఠశాల రీజనల్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్, కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్లు సూర్యచంద్ర, సత్యనారాయణ, చిన్నంనాయుడు, గిరి, ఉపాధ్యాయులు ఉన్నారు. – విజయనగరం అర్బన్

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి..

● ఆర్డీఓ దాట్ల కీర్తి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

భోగాపురం: త్వరలో రెవెన్యూ అధికారులు చేపట్టబోయే రీసర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకుని.. తమ భూముల్లో ఏమైనా తప్పులుంటే సరిచేసుకోవాలని ఆర్డీఓ దాట్ల కీర్తి రైతులకు సూచించారు. మండలంలోని రావాడలో తహసీల్దార్ ఎం. సురేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వేలో భాగంగా ముందుగా మండలంలోని రావాడ రెవెన్యూ గ్రామంలో రీసర్వే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 18 వరకు రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, విలేజ్ బౌండరీలను గుర్తించడం జరుగుతుందన్నారు. 18 తర్వాత రైతులకు సంబంధించిన జిరాయితీ భూముల సర్వే చేపడతామని చెప్పారు. ఈ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, వీఆర్వో కాళి, విలేజ్ సర్వేయర్లు పాపారావు, కిరణ్, సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ దంతులూరి సూర్యనారాయణరాజు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి



క్యాలెండర్లను విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, తదితరులు

భోగాపురం: అంచలంచెలుగా రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే తమ ముందున్న లక్ష్యమని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్‌తో కలిసి శనివారం ఉదయం శ్రీకాకుళం వెళ్తుండగా... మార్గమధ్యలో భోగాపురంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, భోగాపురం తాలుకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసినప్పుడు కొన్ని ప్రధానమైన సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చామన్నారు. పీఆర్సీ ఏర్పాటు, జీపీఎఫ్ఏపీజీఎల్ఐ అడ్వాన్స్ చెల్లింపులు, కరువు భత్యం, తదితర సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయిన తర్వాత తాలుకా యూనిట్ సమావేశానికి రావడం ఇదే ప్రథమమని కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు వారి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. భోగాపురంలో ఉద్యోగుల భవనానికి సహకరించాలని తాలుకా సంఘ అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు కోరగా శివారెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘ నాయకులు డీవీ రమణ, సురేష్, కిషోర్, సురేష్‌కుమార్, ఆనందకుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అంధుల ఆశాజ్యోతి లూయిూ బ్రెయిలీ

● జిల్లా సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు

డెంకాడ: ఆరు అంకెల బ్రెయిలీ లిపిని కనిపెట్టిన లూయి బ్రెయిలీ అంధుల ఆశాజ్యోతి అని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు అన్నారు. బ్రెయిలీ జయంతిని శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి అంధత్వంతో బాధపడిన లూయిూ బ్రెయిలీ ఆరంకెల లిపిని కనిబెట్టారని చెప్పారు. ఉపాధ్యాయుడిగా, ప్రొఫెసర్‌గా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థులు ఈ లిపిని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈఓ వి.శ్రీరాము మాట్లాడుతూ.. దృష్టిలోపం ఉన్న చిన్నారులకు ప్రభుత్వం కళ్లద్దాలను అందిస్తోందని చెప్పారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సహ సమన్వయకర్త భారతి, జీసీడీఓ గాయత్రి, ఏఎస్ఓ జగన్, హెచ్‌ఎం రాజశేఖర్, ఐఈఆర్‌టీలు రవీంద్ర, అప్పలరాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్య దైవం..

పూసపాటిరేగ: లూయి బ్రెయిలీ అంధుల ఆరాధ్య దైవమని మండల విద్యాశాఖ అధికారి బి. పాపినాయుడు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రెయిలీ కనుగొన్న లిపితో ఎంతోమంది అంధ విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలో దివ్యాంగులు పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. నీలిమ, సహిత ఉపాధ్యాయులు బంగారునాయుడు, ఎం. వెంకటేశ్వరరావు, పి. అప్పలనర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: లూయిూ బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఓ పి.బాలాజీ

అంధుల పాఠశాలలో...

విజయనగరం అర్బన్: నగరంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో లూయిూ బ్రెయిలీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న బ్రెయిలీ విగ్రహానికి ముఖ్య అతిథి సీపీఓ పి. బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రాంబాబు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన మినీ గోకులాలు..

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం రూరల్: పాడి పరిశ్రమ అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం మంజూరుచేస్తున్న మినీ గోకులాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 26 మినీ గోకులాలను పూర్తి చేసినట్లు చెప్పారు. రైతుల ఆశక్తిని గ్రహించి మరో 45 గోకులాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని పిలపునిచ్చారు. ప్రభుత్వం 90 శాతం నిధులు అందించడం జరుగుతుందని.. సంబంధిత రైతులు కేవలం పది శాతం మాత్రమే పెట్టుబడి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతినాయుడు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, పశు వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారులను కేంద్రాలకు పంపించండి..

విజయనగరం ఫోర్ట్: మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆట, పాటల విద్యతో పిల్లల్లో మానసికంగా బలోపేతమవుతారని చెప్పారు.

పరామర్శ..



సూరి రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గేదెల సూరిరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవెళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

భగవద్గీత చదవాలి..

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని.. మనిషి జీవితానికి అసరమైన దార్శనికతను అందించే శక్తి భగవద్గీతకు ఉందని ఇస్కాన్ దేవాలయం విశాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'భగవద్గీతను దైనందిన జీవితంలో ఎలా అన్వయించుకోవాలి' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని సంతోషకరంగా ఎలా గడపాలో భగవద్గీత చెబుతోందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్యవక్తను ఘనంగా సత్కరించింది. సహస్ర సేవా టీమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి , వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే..



భోగాపురం: పెదహరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే వేడుకలు

భోగాపురం: మండలంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే (ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు ఏవిధంగా ఆట, పాటలతో కూడిన విద్య అందిస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: దన్నానపేట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి, సిబ్బంది

దన్నానపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి మాట్లాడుతూ.. చిన్నారులను ఆయాలు క్రమం తప్పకుండా కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజమహంతి జయప్రద, సిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

వలంటీర్లకు న్యాయం చేయండి..

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. పది వేలు జీతం ఇచ్చి కొనసాగిస్తామని చెప్పిన నాయకులు ఆ మాటను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో టీడీపీ నాయకులకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా 49 వ డివిజన్ కార్పొరేటర్ కె. రాధామణి, 50వ డివిజన్ టీడీపీ నాయకులకు వినతిపత్రాలు ఇచ్చి, వాటిని అధిష్టానానికి పంపించి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులు నిబద్ధతతో చదవాలి

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి
● ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



నెల్లిమర్ల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: విద్యార్థులు నిబద్ధతతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండల కేంద్రంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పేదరికం కారణంగా మధ్యలో చదువు ఆపకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కళాశాలకు 12 అదనపు గదులు కావాలని ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణరాజు, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, రవ్వా నాని, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ ఎం. రాధికతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళి, హెచ్‌ఎం బి. శంకరరావు, సర్పంచ్ టొంపల సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు పిన్నింటి లక్ష్మినాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.